

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## జనసేనాని పవన్‌తో వేములపాటి భేటీ



**నెల్లూరు , జూన్ 15 ప్రభాతవార్త** విద్య జనసేన పార్టీ అధినేత , రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ సోమవారం దేశ రాజధాని డిల్లీలో రాష్ట్ర టిడ్‌కో ఛైర్మన్ , జనసేన పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు ఈ సందర్భంగా పవన్ వేములపాటిని కరచాలనంతో ఆప్యాయంగా పలకరించి యోగ క్షేమాలని అడిగి తెలుసుకొన్నారు . ఆలాగే జిల్లాలో పార్టీ బలోపెతానికి తీసుకోవాల్సిన చర్యలు , స్థానిక ఎన్నికల్లో విజయంకోసం చెయ్యాల్సిన పనులు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలని చర్చించారు ఈ కార్యక్రమంలో జనసేన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి



**నెల్లూరు, జూన్ 15, ప్రభాతవార్త** సింగపూర్ లో మంత్రి నారాయణ జన్మదిన వేడుకలు. కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.

## సైదాపురం మండలంలో టీడీపీలో వర్గ విభేధాలు బహిర్గతం

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్యకర్తలు నిరసన
- పార్టీ కోసం కష్టపడ్డవారికి గుర్తింపు లేదని ఆవేదన





**సైదాపురం, జూన్ 15, ప్రభాతవార్త** సైదాపురం మండలంలోని తెలుగుదేశం పార్టీలో అంతర్గత విభేధాలు బహిర్గతం అయ్యాయి. పార్టీలో ఆరంభం నుంచి కష్టపడి పని చేసిన నాయకులకు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వకుండా ఇటీవల పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యత కల్పిస్తున్నారని మండల పరిధిలోని మర్లపూడి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు వరదబండి వెంకటేశ్వర్లు రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ 2019నుంచి 2024 వరకు మర్లపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని తెలుగుదేశం పార్టీ కోసం తాము కష్టపడి పనిచేశామని, దీంతో అప్పటి వైసీపీ ప్రభుత్వంలో మమ్మల్ని అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టి కేసులు పెట్టడం కూడా జరిగిందని ఆయన తెలిపారు. ధైర్యంగా ముందుకు వెళ్లి కార్యకర్తలకు అండగా ఉంటూ 2024లో పార్టీని గెలిపించుకున్నామని ఆయన అన్నారు. అయితే సైదాపురం మండలంలో ఉన్న అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు అనే వ్యక్తి మండల పెత్తనం నాదేనంటూ ప్రతి గ్రామంలో పార్టీ కోసం కష్టపడిన వారికి కాకుండా కొన్ని చోట్ల వైసీపీ నుంచి టీడీపీలోకి కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీని రెండు వర్గాలుగా చీల్చి పార్టీని నమ్ముకున్న నాయకులను, కార్యకర్తలను అనేక ఇబ్బందులు పెడుతున్నారని వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. మర్లపూడి గ్రామంలో 2019నుంచి పార్టీ పరంగా ఎలాంటి సభ్యత్వం లేకుండా గతంలో వైసీపీ పార్టీలో పని చేస్తూ మమ్మల్ని ఇబ్బందులకు గురి చేసిన వ్యక్తులకు ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో మర్లపూడి గ్రామ పగ్గాలు ఇవ్వడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే కాకుండా మండలంలోని ప్రతి గ్రామంలో సుబ్రహ్మణ్యం నాయుడు అనే వ్యక్తి టీడీపీని రెండు వర్గాలు చీల్చి పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహారిస్తూ నాయకులను, కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. దీంతో కొన్ని గ్రామాల్లోని కార్యకర్తల్లో అసంతృప్తి పెరిగిపోతుందని అన్నారు. మర్లపూడి గ్రామంతో పాటు కొన్ని గ్రామాల్లో పార్టీ కోసం కష్టపడిన వారిని పక్కనపెడుతూ ఈ మధ్య కాలంలో వచ్చిన వ్యక్తులకు పగ్గాలు ఇవ్వడంతో పలు గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు త్వరలో ఆందోళన చేపట్టే అవకాశం ఉందని వెంకటేశ్వర్లు రెడ్డి తెలిపారు. ముఖ్యంగా మర్లపూడి గ్రామంలో పంచాయతీ సర్పంచ్‌ల పదవి కాలం ముగిసిన తరువాత ప్రత్యేక అధికారులతో అభివృద్ధి జరగడం లేదని, ఓ నాయకుడి మాటలు వింటూ పూర్తి స్థాయిలో అభివృద్ధి లేకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. గ్రామంలో ఎక్కడపెడితే అక్కడ డ్రైనేజీ పరిస్థితి దారుణంగా ఉందని, దీంతో డ్రైనేజీ నీరు ఎస్టీ, బీసీ, మైనార్టీల ఇళ్లల్లోకి చేరుతుందని, అదే విధంగా స్థానికంగా ఉన్న హైస్కూల్‌లో కూడా డ్రైనేజీ నీరు చేరి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయమై తహసీల్దార్‌కు వినతిపత్రం అందించడం జరిగిందని, గతంలో పలు మార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేదని తెలిపారు. అలాగే గ్రామకంఠంలోని బోరు నుంచి కొంత మంది వారి వ్యక్తిగత అవసరాల కోసం మోటార్లతో నీరు వాడుకుంటున్నారని గ్రామస్తులు తహసీల్దార్ సుభద్రకు వినతిపత్రం అందించారు. ఇప్పటికైనా ముఖ్య నాయకులు మండలంలో తెలుగుదేశం పార్టీని కాపాడాలంటూ కార్యకర్తలు, నాయకులు కోరుతున్నారు.

## బిసిల పక్షపాతి చంద్రబాబునాయుడు : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**బుచ్చి జులై 15 ప్రభాతవార్త** టిడిపి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎప్పుడు బిసిల పక్షపాతి అని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రశంసించారు. మండలంలోని పెనుబల్లి గ్రామంలో బిసి కాలనీలో మహిళల సమస్యలు తెలుసుకున్నారు. చెట్టుకింద మహిళ మధ్యలో కూర్చోని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో త్రాగునీటి సమస్య ఉందని చెప్పగా ట్యాంకు పూర్తి అయిందని కొద్ది రోజులలో ట్యాంకు ద్వారా త్రాగునీరు అందిస్తామని అన్నారు. ఉదయం వస్తున్న బస్సు కావాలని కోరగా వెంటనే స్పందించిన ఆమె ఆర్టీసీ డిఎంతో మాట్లాడి సమస్య పరిష్కరి స్తానని హామి ఇచ్చారు. టిడిపి హయాంలో 80 లక్షలతో రోడ్లు, డ్రేనేజిలు వేశామని చెప్పారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి సంక్షేమం రెండు సమానంగా చేస్తున్నామని అన్నారు. స్త్రీ శక్తి ద్వారా మహిళలు నిత్యం బస్సులో వెళుతున్నామని చాలా బాగుందని చెప్పారు.

❖ వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని తెలిపారు.

ఈ ప్రభుత్వం మహిళల ప్రభుత్వమని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం 33 శాతం రిజర్వేషన్ ఇవ్వడం జరిగిందని అన్నారు.మహిళలను గౌరవించే సంస్కృతి రాజకీయనాయకులు నేరవేర్చకోవాలని అన్నారు.

❖ ఎవ్వరు మహిళలను అగౌరవిస్తు మాట్లాడాని ప్రజలందరు ప్రతిఘటించాలని అన్నారు.ఈ రోజులు హోం మినిస్టర్ అనితాను కొంతమంది నాయకులు కావాలని మాట్లాడారు. ఇటువంటి మాటలు మంచి పద్దతి కాదని హితవు పలికారు. బిసిలను కూలీలుగా కాకుండా వ్యాపారవేత్తలు గా చూడాలన్నదే చంద్రబాబులక్ష్యమని అన్నారు.

❖ 51 వేల కోట్లు బిసి సంక్షేమ కోసం ప్రభుత్వం కేటాయించదని అన్నారు.

ఎంతమంది బిడ్డలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, వవ్వేరు బ్యాంకు ఛైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ, బుచ్చి రూరల్ బ్యాంకు ఛైర్మన్ ఏటూరు శివరామకృష్ణారెడ్డి, టిడిపినాయకులు ఓడా పెంచలయ్య,

❖ మహేంద్ర, ఎంపిటిసి సభ్యులు చేవూరు వినయ్‌నారాయణ, జొన్నవాడ సర్పంచ్ పెంచలయ్య, దొడ్ల కోదండరామిరెడ్డి, అధికారులు తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సంతోష్‌రెడ్డి, ఆర్ఐ శాంతి సచివాలయ సిబ్బంది, మైనార్టీనాయకురాలు షేక్ ఫర్వీనా, పలువురు టిడిపినాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లా సర్వతోముఖాభివృద్ధి

- కేంద్ర పథకాల అమలులో మరింత వేగం పెంచాలి
- దిశా సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



**నెల్లూరు-కలెక్టరేట్, జూన్ 15, ప్రభాతవార్త :** జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకాలు, కేంద్ర నిధులతో అమలవుతున్న కార్యక్రమాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, నగర మేయర్ సుజాత, జెడ్పి సీఈవో శ్రీధర్ రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో విబి జీ రాం జీ ఉపాధి హామీ పథకం, జలధార, జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, ఐసిడిఎస్, గృహ నిర్మాణం, టిడ్కో ఇళ్లు, స్కిల్ డెవలప్మెంట్ శాఖల వారీగా చర్చించారు.

**ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ** జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై దిశ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించామని, అధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిపారు. సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన ప్రతి అంశంపై అధికారులు స్పందించి, సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట కాలపరిమితితో కూడిన కార్యాచరణ రూపొందించడం సానుకూల పరిణామమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా జిల్లాకు మరింత ప్రయోజనం చేకూరే అవకాశం ఉందన్నారు. అందుబాటులో ఉన్న కేంద్ర పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే జిల్లాకు మరింత నిధులు, అభివృద్ధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, దిశా కమిటీ సభ్యులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమగ్ర అవగాహన పెంపొందించుకుని వాటి అమలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలని కోరారు. ప్రతి అర్హుడికి పథకాల ప్రయోజనాలు అందేలా మార్గనిర్దేశనం చేయాలని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద నిధుల లభ్యతకు ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొంటూ, జిల్లాలో కేంద్ర పథకాల అమలును మరింత వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకుని జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు.

**నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని బుజబుజ నెల్లూరు, కనుపర్తిపాడు జంక్షన్ల వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్లను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని జాతీయ రహదారుల అధికారులను కోరారు. అక్టోబర్ నాటికి పనులు పూర్తిచేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే బీవీ నగర్, కొండాయపాలెం రైల్వే గేట్ల వద్ద ఆర్‌యూబీల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ వేగవంతం చేసి వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. ఐదు నెలల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, ఏడాదిలోపు నిర్మాణాలు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. వేదాయపాలెం ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అక్కడి రైల్వే స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేయాలని రైల్వే అధికారులకు సూచించారు. వనంతోపు, బీవీ నగర్ ప్రాంతాల్లో నూతనంగా మంజూరైన రహదారి పనులకు సంబంధించి బాక్స్ కల్వర్టుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఆమంచర్ల వద్ద ఏపీఐఐసీ ద్వారా సేకరించిన 500 ఎకరాల భూమిలో పరిశ్రమల ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతుల సమస్య తలెత్తిందని, దీని వల్ల ప్రతిపాదిత పరిశ్రమల ఏర్పాటు నిలిచిపోయిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి పరిశ్రమల స్థాపనకు మార్గం సుగమం చేయాలని కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్, సంబంధిత భూమిని పరిశ్రమల ఏర్పాటుకు వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు.

**వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ :** గతంలో గృహ నిర్మాణ పథకాల అమలులో జరిగిన లోపాల కారణంగా అనేక మంది పేదలు ఇళ్ల ప్రయోజనం పొందలేకపోయారని తెలిపారు. అలాంటి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారికి తిరిగి గృహాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను కోరారు. దక్కిలి మండలంలోని చెంచమ్మ గుడి, బాలాయపల్లి మండల పరిధిలో రహదారుల నిర్మాణాలకు అవసరమైన అటవీ శాఖ అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అలాగే గూడూరు-వెంకటగిరి, సైదాపురం-దేగపూడి ఆర్ అండ్ బీ రహదారుల పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు.

**జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ :** చింతారెడ్డిపాలెం క్రాస్ రోడ్డు వద్ద ప్రతిపాదిత అండర్‌పాస్ నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని కోరారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. స్పందించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. జిల్లాలో రహదారుల నిర్మాణం, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి జిల్లా పరిషత్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

## విస్తృతంగా గ్రంథాలయాలను సందర్శిస్తున్న నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ ఛైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి





**నెల్లూరు, జూన్ 15, ప్రభాతవార్త :** సోమవారం సర్వేపల్లి నియోజకవర్గంలోని తోటపల్లిగూడూరు, ఈదురు,కోవూరు నియోజకవర్గంలోని మైపాడు, ఇందుకూరు పేట గ్రంథాలయను ఉమ్మడి నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ ఛైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి సందర్శించారు. అక్కడ ఉన్న పరిస్థితులను సిబ్బంది, స్థానికుల ద్వారా తెలుసుకున్నారు . గ్రంథాలయాల సేవలు స్థానికంగా విస్తృతం చేయడం కోసం కృషి చేయాలని సిబ్బందికి తెలియజేశారు. సెస్ నిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో జిల్లాలోని అన్ని గ్రంథాలయంలో రీడర్స్ కు కావలసిన సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఆమె తెలియజేశారు. కూటమి ప్రభుత్వ గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు.గ్రంథాలయాల పట్ల ప్రజలు ఎక్కువ ఆకర్షితులయ్యే విధంగా సిబ్బంది పని చేయాలని తెలియజేశారు.

## రిటైడ్ ఉపాధ్యాయుడు కుటుంబం ఆత్మహత్య





**సంగం జూన్ 15, ప్రభాతవార్త** సంగం మండలం దువ్వూరు గ్రామంలో రిటైడ్ ఉపాధ్యాయులు మదు కుటుంబం ఆత్మహ్యత చేసుకొని బలవర్మణం చెందారు. ఈ సంఘటన దువ్వూరు గ్రామంలో విషాధచాయులు అలముకున్నాయి. పోలీసులు కధనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దువ్వూరుకి చెందిన రిటైడ్ ఉపాధ్యాయులు మధుసూదన్‌రావు, భార్యరత్నావళి, కుమారుడు సాయి సుకృత్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు సంగం సిఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వారు మరణవాంగ్మూలంలో తాము శారీరకంగా, మానసికంగా బలంగా లేమని భవిష్యత్తులో సమాజంలో ఎలా బ్రతకాలో అర్ధం కాక ఈలోకం విడిపోతున్నట్లు లేఖలో పేరున్నారని ఆయన తెలిపారు. వాళ్ళ ఆస్తులు ఎవ్వరిఎవ్వరికె చెందలో వీలునామాలో వ్రాసిపెట్టడం జరిగిందని తెలిపారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం తరలిం కేసు విచారిస్తున్నట్లు తెలిపారు. మృతుడు మధుసూదన్‌రావు ఒక ఫ్లాట్ రెడ్ క్రాస్‌కు కూడా వ్రాయడం జరిగింది. మరణంలో కూడా బందువులు, ప్రజల శ్రేయస్సు కోరిన ఆకుటుంబం ఇలా బలమన్మరణం చెందడం ప్రతి ఒకరి హృదాయాలు కలి వేసింది. మదు కొడవలూరు మండలం కొత్త వంగల్లు గ్రామం లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తు మూడు సంవ్సరాల క్రితం రిటైడ్ అయ్యాడు, కుమారుడు సాయిసుకృ తు తిరుపతిలో బిటెక్ చేస్తున్నాడు. వీరి మృతి సంచలనంగా మారింది.



## ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తా

కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి



**కావలి, జూన్ 15 ప్రభాతవార్త :** ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని వాటికి సత్వరం పరిష్కారం చేపాలనే లక్ష్యంతో పనిచేయడం జరుగుతుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గం నుండి పెద్దసంఖ్యలో వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత సామాజిక సమస్యలకు సంబందించిన వినతులు ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే సమస్యలపై ప్రజలతో మాట్లాడి అర్జీని పరిశీలించి సమస్యల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. సమస్యను బట్టి సంబంధితశాఖల అధికారులకు ఫోన్‌లో తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలను వేగంగా పరిష్కరించడం చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలు సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నెల్లూరు కార్పోరేషన్‌లో పిజిఆర్ఎస్ అర్జీలు



**నెల్లూరు కార్పోరేషన్, జూన్ 15 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేధికలో వచ్చిన పిజిఆర్ఎస్ అర్జీలు నగరపాలక సంస్థ మేయర్ దేవరకొండ సుజాత అశోక్, కమిషనర్ వై.నందన్‌లు పాల్గొని అర్జీలు స్వీకరించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులను క్షేత్రస్తాయిలో పరిశీలించి వాటికి సంబంధించిన విభాగాల అధికారుల ద్వారా శాశ్విత పరిష్కారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో విభాగాల వారీగా టిడ్కో హౌసింగ్ 3, టౌన్‌ప్లానింగ్ 10, రెవెన్యూ 1, ఇంజనీరింగ్ 5, ఆప్కస్ 1, అకౌంట్ సెక్షన్ 2, పబ్లిక్ హెల్త్ 1, అడ్మినిస్ట్రేషన్ 1, మొత్తం 24 వినతులను మేయర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటి కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రహంతుజానీ, ఈఈలు శేషగిరిరావు, అనీల్‌కుమార్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ దినేష్, టౌన్‌ప్లానింగ్ విభాగం ఏసీపీలు వేణు, సతీస్ ఉద్యానశాఖ అదికారి నరసింహారావు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోంది




**నెల్లూరు-అగ్రికల్చర్, జూన్ 15, ప్రభాతవార్త** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బిజెపి నాయకులు సోమవారం నెల్లూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో వరుసగా 12 సంవత్సరాలు ప్రధానమంత్రిగా సేవలందిస్తూ మోడీ ప్రత్యేక గుర్తింపు సాధించారని అన్నారు. కేంద్ర మంత్రివర్గంలో బడుగు, బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. వలసవాద చిహ్నాలను క్రమంగా తొలగిస్తూ, దేశంలో జాతీయ భావనను బలోపేతం చేశారని పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ద్వారా దేశీయ ఉత్పత్తి రంగానికి ఊతమిచ్చి, భారతదేశాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని చెప్పారు. డిఫెన్స్ రంగంలో దిగుమతులపై ఆధారపడే స్థాయి నుంచి ఎగుమతులు చేసే స్థాయికి దేశాన్ని తీసుకువెళ్లారని తెలిపారు. ప్రపంచ దేశాలు భారత్ వైపు ఆశాజనకంగా చూస్తున్నాయని, మోడీని ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. పేదరిక నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. దేశ రక్షణ రంగాన్ని తిరుగులేని శక్తిగా మలుచుకుంటూ, శత్రు దేశాలకు దీటుగా సమాధానం ఇస్తున్న ఏకైక ప్రధాని నరేంద్ర మోడీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిఫా రెడ్డి వంశీధర్ రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పరుశురాం, వై. ఫణి రాజు, బాలకృష్ణమ నాయుడు, పెంచలయ్య, రాజేష్, సృజనతోపాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పరిష్కార వేదికకు సమస్యల వెల్లువ

- పరిష్కార వేదికకు 397 అర్జీలు
- కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు-కలెక్టరేట్, జూన్ 15, ప్రభాతవార్త** సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి వచ్చిన అర్జీలను కలెక్టర్ హిమాన్షు శుక్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, తెలుగు గంగ ప్రత్యేక అధికారులు కేశవర్ధన రెడ్డి, వంశి కృష్ణా, మెప్మా పిడి కిరణ్ కుమార్, ఐటిడిఏ పిఓ శ్రీనివాసరావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగ శేఖర్ తదితరులు అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ రేపు స్థానిక కస్తూరిబా గార్డెన్స్‌లో రెండు సంవత్సరాల ప్రభుత్వ పాలనపై జరిగే కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు విజయవంతం అయ్యేలా తమకు కేటాయించిన విధులను జాగరూకతతో నిర్వహించి కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతిబింబించేలా ఆయా శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సదరు కార్యక్రమానికి సుమారు 5 వేల మంది దాకా హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా అధికారులు ఆయా శాఖలకు సంబంధించి పి జి ఆర్ ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను పరిష్కారం అయ్యేలా చూడాలని సదరు విషయాల ను సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలని ఆయన సూచించారు. అధికారులు ఈపి టిఎస్, పిజిఆర్ఎస్‌లో అర్జీలను త్వరితగతిన పరిష్కరింప చేయాలన్నారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు అవసరమైన మౌలిక వసతులతో పాటు ప్రత్యేక క్యూ లైన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు చలువ పందిళ్లను ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే ఉచిత భోజన సదుపాయాన్ని అందించారు. రెవిన్యూ సంబంధిత విషయాలను పరిష్కరించే విధంగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడం తో పాటు ప్రాథమిక వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగింది.

**- పరిష్కార వేదికకు 397 అర్జీలు..** సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 397 అర్జీలు రాగా దాంట్లో అధికంగా రెవెన్యూ 203 అర్జీలు వచ్చాయి. సర్వే 20 పోలీస్ 40 మున్సిపల్ 30 మరిన్ని కురవ శాఖలు ఉన్నాయి.

# ఎమ్మెల్యేచే ఆర్థిక సహాయం



**కోట,.జూన్ 15 ప్రభాతవార్త :** కోట మండలం సిద్దమకండ్రగ గ్రామానికి చెందిన మల్లి కృష్ణమరాజుకు చెందిన పూర్లిలు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఆమేరకు గూడూరు శాసన సభ్యులు డాక్టర్ ,పాశం సునిల్ కుమార్ స్పందిచి బాధితుడికి రూ 10 వేల రూపాయాలను ఆర్థిక సహాయం అందచేశారు. ఆనగదను కోట మండల తహిసీల్దార్. కె.జయజ యరావు, తెదేపా నాయకులు ఎం.సర్వోత్తమ్‌రెడ్డి, చిట్టేడు సోసైటి చైర్మెన్ చాపల శ్రీనివాసులు,కోటీ,లు అందజేశారు.

# సర్వేలతో సతమతం సచివాలయ సిబ్బంది ఆవేదన

కోట,జూన్ 15 ప్రభాతవార్త:సర్వేలతో సచివాలయ ఉద్యోగులు సతమతమవుతున్నారు. దీంతో తలకు మించిన భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒకే సారి నాలుగు రకాల పనులకు సంబంధించి పనులు చేయడం కత్తిమీద సాముగా మారిందని వాపోతున్నారు.వచ్చిన చిక్కల్లా ఇందులో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం వివిధ రకాల సర్వేలకు సంబంధించిన బాధ్యతలు అప్పగిచింది. ఎన్నికల సంఘం ప్రతిషాత్మకంగా చేపట్టిన సర్‌లో ఇప్పటికే ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేశారు.ఇక సోమవారం నుంచి ఇంటి ంటికీ వెళ్లి సంబంధిత పత్రాలు అం దించి,వారితోనే పూర్తి చేయించాలి.ఇదే సమయంలో 2002 జాబతాలో వివరాలు సరిపోకపోతే దీనికి కారణాలు నమోదు చేయాలి. దీన్ని అత్యంత పారదర్శకంగా చేపట్టాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వెలవడ్డాయి.మరో వైపు ఆస్తి పన్నకు సంబంధించి డిమాండ్ నోటీసులు,సైతం వీరే జారీ చేస్తున్నారు. ఇంకో పక్క స్వర్ణాంధ్ర.స్వచ్చాంధ్రలో భాగంగా పారిశుధ్య నిర్వహణపై ప్రజల అభిప్రాయాలు సేకరించి పనిలో ఉన్నారు.

**యోగాంధ్ర వివరాలు :** యోగాంధ్ర లో భాగంగా గత ఏడాది నమోదైన వారి వివరాలు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసే బాధ్యతను సచివాలయ సిబ్బందికి అప్పగించారు. దీంతో పాటు కొత్తవారిని ఇందులో నమోదు చేయాల్సి ఉంది. ఒక్కొక్క స్వర్ణ,గ్రామ వార్డు పరిధిలో జనాభా రెండు వేలు ఉంటే పాత వారు 50 శాతం వరకు ఉన్నారు. వీరి వివరాలు నమోదు చేయాల్సి రావడంతో ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. నమోదు సమయంలో ఫోన్‌కి ఓటీపీ వస్తోంది.దీన్ని నమోదు చేస్తేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తివు తోంది.ప్రస్తుతం ఓటీపీ మోసాలు ఎక్కువగా ఉండటంతో కొందరు దీన్ని చెప్పడానికి ముందుకు రావ దంలోదని సచివాయ సిబ్బంది పేర్కొంటున్నారు. దీని వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు.

# సోమశిల డ్యామ్‌లో దెబ్బతిన్న ఆఫ్రాన్ నిర్మించాలి

**– హై లెవెల్ కెనాల్‌కి నిధులు మంజూరు చేయాలి**

**– సోమశిల పర్యవేక్షక ఇంజనీర్ బి.వి.రమణారెడ్డికి బీజేపీ నేత మిడతల వినతిపత్రం**



**నెలూరు, జూన్ 15, ప్రభాతవార్త – అగ్రికల్చర్ :**నెల్లూరు జిల్లాలో నీటి పారుదల ప్రాజెక్టుల పనులు, నిధుల కొరత కారణంగా అసంపూర్తిగా మిగిలిపోయాయని, వాటికి నిధులు మంజూరు చేసి పునః ప్రారంభించాలని బీజేపీ నేత మిడతల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నెల్లూరులో సోమశిల పర్యవేక్షక ఇంజనీర్ బి.వి.రమణారెడ్డికి ఆయన సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ 2021 వరదల్లో సోమశిల డ్యాం ముందు భాగంలో ఆఫ్రాన్ దెబ్బతింటే, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు 2024 ఆగస్టులో దెబ్బతిన్న ఆఫ్రాన్ ను సందర్శించి 140 కోట్ల నిధులు కేటాయించినట్లు చెప్పారని వివరించారు. అయితే ఆ పనులు 30 శాతం మాత్రమే జరిగాయని నిధుల కొరత కారణంగా కాంట్రాక్టర్లు పనులను ఆపివేశారని వెల్లడించారు. సోమశిల డ్యామ్ నుండి కండలేరు జలాశయానికి వరద జలాలను తీసుకెళ్లే వరద కాలువ విస్తరణ పనులు 800 కోట్ల రూపాయలు విలువచేస్తాయని అయితే 27 మాత్రమే పనులు జరగగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవడంతో ఆ పనులను ఆపివేసినట్టు తెలిపారు. ఇలాంటి అత్యవసరమైన నీటి ప్రాజెక్టులకు నిధులు మం జూరు చేసి పనులు పునః ప్రారంభించాలని బీజేపీ డిమాండ్ చేస్తుందని రమేష్ తెలిపారు. సోమశిల హై లెవెల్ కెనాల్ పనులు నిధుల కొరతతో ఆగిపోయాయని చెప్పారు. నెల్లూరు జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్ట లకు నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను కూడా భర్తీ చేయాలన్నారు. 2010వ సంవత్సరంలో సోమశిల డ్యాం నిర్వహణ కొరకు 47 మంది సిబ్బంది ఉండేవారని ప్రస్తుతం అదే డ్యాం నిర్వహణకు నలుగురు సిబ్బంది మాత్రమే ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా సిబ్బంది నియామకాన్ని పూర్తి చేయలేదన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అత్యవసరంగా నిధులు మంజూరు చేసి ఆగిపోయిన పనులను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు నరాల సుబ్బారెడ్డి, పైడిమాని ఆదినారాయణ, సృజన, అల్లూరు నాగేంద్ర సింగ్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు

**– నాకాబందీతో అసాంఘిక శక్తులకు చెక్**





**నెల్లూరు క్రైం, జూన్ 15, ప్రభాతవార్త :** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా నెల్లూరు పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. జిల్లా ఇంచార్జి ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌజన్య పర్యవేక్షణలో ఆదివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నాకాబందీ, లాడ్జి చెకింగ్‌లు నిర్వహించారు. 263 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జాతీయ రహదారులు, అనుమానితుల నివాసాలలో విస్తృతంగా సోదాలు నిర్వహించాయి. ఈ మెరుపు దాడుల్లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. మొత్తం 42 ఓపెన్ డ్రింకింగ్ కేసులు, 31 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, 430 మందిపై మోటారు వాహన చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల ద్వారా మొత్తం రూ. 1,71,500 నగదు జరిమానాను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రౌడీ షీటర్లు తదితర అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు క్రైమ్ ప్రోన్ ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షణ పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. గంజాయి, పేకాట, ఈవ్ టీజింగ్ వంటి నేరాలకు తావులేకుండా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. నేర నియంత్రణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, ఎలాంటి అనుమానాస్పద కదలికలు కనిపించినా వెంటనే డయల్ 100, 112 లేదా జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 9392903143కు సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు.

# వాగు పూడికతీత పనులు ప్రారంభం



**వింజమూరు, జూన్ 15, ప్రభాతవార్త :** వింజమూరు మండలం శంఖవరం గ్రామంలో పూడికపోయిన వాగు పూడిక తీత పనులను సోమవారం ఇరిగేషన్ శాఖ ఏఈఓ. మహేంద్ర పనులను ప్రారంభించారు. గత ఏడాది దిత్వా తుఫాను కారణంగా మట్టి చెత్త చెట్లతో పూడుకుపోయిన వాగు మరమ్మత్తులకు ఎఫ్‌డిఆర్ నిధులు సుమారు నాలుగు లక్షల పైచిలుకు మంజూర య్యాయని మంజూరైన నిధులతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు పనులు ప్రారంభించామన్నారు. గత ఏడాది తుఫాను సమయంలో కూడుకుపోయిన మట్టిని చెట్లను తొలగించేందుకు జిల్లా కలెక్టర్ ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్ విధుల నుంచి 4 లక్షల 95 వేల రూపాయలు మంజూరు చేశారన్నారు. మంజూరైన నిధులతో చెరువు సంఘం అధ్యక్షులు భూమిరెడ్డి పెంచల్ రెడ్డి తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భూమిరెడ్డి నరసింహారెడ్డి గ్రామ కమిటీ అధ్యక్షులు గ్రామ పెద్దలతో కలిసి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. వాగులో పేరుకుపోయిన మట్టిని యంత్రాల సాయంతో తొలగించడం జరుగుతుందన్నారు. వాగు మరమ్మత్తులు పూర్తయితే చుట్టుపక్కల ఉన్న రైతులకు సాగునీరు సవ్యంగా అందుతుందన్నారు అలాగే వర్షాకాలంలో వరద నీరు సజావుగా ప్రవహించి పంట పొలాల ముప్పుకు గురికాకుండా ఉంటాయన్నారు. రైతులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. పనులు వేగంగా పనులు వేగంగా పూర్తి చేసి ఈ ఖరీఫ్‌కి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని ఏఈ మహేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా భూమిరెడ్డి నరసింహారెడ్డి పెంచల్ రెడ్డి మాట్లాడుతూ వాగు మరమ్మత్తుల విషయమై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకు వెళ్లిన వెంటనే సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరుకు కృషి చేయడం ఈ ప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రారంభం

**కోట, జూన్ 15 ప్రభాతవార్త :** జిల్లాలోని ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. బిఎల్ఓలు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఈ సందర్భంగా తహశీల్దార్ కె.జయజయరావు కోరారు. మొత్తం ప్రక్రియ పూర్తయ్యాక జూలై 21న ముసాయిదా జాబితాను పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శిస్తారు. అదే నెల 21 నుంచి ఆగస్టు 20వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. వాటి పరిశీలన తర్వాత సెప్టెంబర్ 22న తుది జాబితా ప్రకటిస్తారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. మార్పులు, చేర్పులకు సైతం అవకాశం కల్పించారు. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలు ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తారు. సర్ పూర్తయిన తర్వాత పోలింగ్ కేంద్రాల్లో హేతుబద్ధీకరణ చేపడతారు.

# ట్రిపుల్ ఐటికి పదిమంది విద్యార్థులు ఎంపిక



**మర్రిపాడు ,జూన్15,ప్రభాతవార్త:** ట్రిపుల్ ఐటిలో ప్రవేశానికి మర్రిపాడు మండలం నుండి పదిమంది విద్యార్థులు ఎంపికయ్యారని మండల విద్యాశాఖ అధికారులు తిరుపతయ్య, ధనలక్ష్మిలు తెలిపారు. నందవరం మోడల్ స్కూల్‌కు చెందిన గోవర్ధన్ నూజివీడు క్యాంపస్‌కు, వసిహ , వసుధలు ఇడుపులపాయ క్యాంపస్‌కు, వాణి ఒంగోలు, నందవరం ఉన్నతపాఠశాలకు చెందిన వైష్ణవి నూజివీడు, కస్తూర్బాగాంధీ విద్యాలయంకు చెందిన మస్తానమ్మ , మహిత, మేరీలు ఇడుపులపాయ, హర్షిత, శ్రావణి ఒంగోలు క్యాంపస్‌లకు ఎంపికయ్యారని వారు తెలిపారు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు , విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# నేల ఆరోగ్య పరిరక్షణే భవిష్యత్ వ్యవసాయానికి పునాది

**– తూర్పుపల్లిలో ఖేత్ బచావో అభియాన్**



**చేజర్ల, జూన్ 15, ప్రభాతవార్త :** నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు సుస్థిర వ్యవసాయాన్ని అందించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. చేజర్ల మండలంలోని తూర్పుపల్లి గ్రామంలో సోమవారం పొదలకూరు వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ సహకారంతో ఖేత్ బచావో అభియాన్– నేల ఆరోగ్యాన్ని కాపాడుకుందాం, భవిష్యత్తును సంరక్షించుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొదలకూరు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ వి.సురేఖాదేవి మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తూ రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తోందన్నారు. వ్యవసాయ భూముల ఉత్పాదక పెరగాలంటే మట్టి నమూనాల పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. మట్టి పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం చేపట్టడం వల్ల సాగు ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడులు పెరుగతాయని తెలిపారు. పచ్చి రొట్ట ఎరువులు, జీవన ఎరువుల వినియోగం ద్వారా నేలలో సేంద్రియ పదార్థాల శాతం పెరిగి, నేల సారవంతత మెరుగుపడుతుందని వివరించారు. వివిధ పంటల్లో వీటి ఉపయోగాలు, ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. మరో శాస్త్రవేత్త ఎస్‌కే హసీనా మాట్లాడుతూ సమగ్ర పోషఖ యాజమాన్యం(ఇంటిగ్రేటెడ్ న్యూట్రిమెంట్ మేనేజ్‌మెంట్) ప్రాముఖ్యతను వివరించారు. పంటల ఆరోగ్యకర పెరుగుదలకు అవసరమైన ప్రధాన, సూక్ష్మ పోషకాల పాత్రను వివరించి, నేల సారాన్ని కాపాడేందుకు సమతుల్య ఎరువుల వినియోగం అవసరమని సూచించారు. వ్యవసాయ అధికారి హిమబిందు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా మాత్రమే యూరియా పంపిణీ జరుగుతుందని తెలిపారు. రైతులు యాప్‌లో నమోదు చేసుకుని అవసరమైన ఎరువులను పొందాలని సూచించారు. అలాగే శాస్త్రవేత్తల సలహాల మేరకు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే రైతుల సందేహాలకు నిపుణులు సమాధానం ఇచ్చి నేల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి హిమబిందు, వీఏఏ సుజాత, వ్యవసాయశాఖ సిబ్బంది, శాస్త్రవేత్తలు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హలోగ్రామ్.. క్యూఆర్ కోడ్

**– సరికొత్తగా ధ్రువపత్రాలు జారీ**

**కోట, జూన్ 15 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ధ్రువపత్రాలకు సంబంధించి స్టేషనరీని మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో, మీ–సేవ కేంద్రాల్లో జారీ చేసే వివిధ ధ్రువపత్రాల్లో మార్పులు తీసుకొచ్చింది. గత ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయాలు ఉండేవి. ఈ పేరుతోనే ధ్రువపత్రాలు జారీ అయ్యేవి. కూటమి ప్రభుత్వం వీటి పేరును స్వర్ణ గ్రామ కార్యాలయాలుగా మార్పు చేసింది. పాత పేరుతో ఉన్న ధ్రువపత్రాలను పూర్తిగా రద్దు చేసింది. ఇకపై స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయం పేరు మీదనే ధ్రువపత్రాలు జారీ చేయాలని ఆదేశాలిచ్చింది. సచివాలయల్లో ప్రస్తుతం ఉన్న పాత స్టేషనరీని వెనక్కి తీసుకుంటున్నారు. ఈ పాత స్టేషనరీ ద్వారా ఎలాంటి ధ్రువపత్రాలు జారీ చేయకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. కొత్త స్టేషనరీని మాత్రమే వినియోగించాలని సూచించింది. పాత స్టేషనరీతో ధ్రువపత్రాలు ఇస్తే ఐడీలో బ్లాక్ చేస్తామని పేర్కొంది. ప్రతి ధ్రువపత్రం వెనుక క్యూఆర్ కోడ్ కనిపిస్తుంది. దాన్ని స్కాన్ చేసి.. ఇది ఎప్పుడు ఎక్కడ జారీ అయిందనే పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.

# కొడవలూరు తహశీల్దార్ కార్యాలయంలో వీడ్కోలు వేడుకలు

**:పదోన్నతిపై సారంగపాణికి ఘన సన్మానం – ఆర్ఐ హైమావతికి వీడ్కోలు**



**కొడవలూరు, జూన్ 15 ప్రభాతవార్త:** కొడవలూరు తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన సారంగపాణి పదోన్నతిపై సంఘ మండల తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కార్యాలయంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు సన్మానం నిర్వహించారు. తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సారంగపాణి సేవలను అధికారులు, సిబ్బంది గుర్తు చేసుకున్నారు. ఆయన విధి నిర్వహణలో చూపిన కృషి, నిబద్ధత, సమర్థతను కొనియాడుతూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ స్ఫూర్తి రెడ్డి మాట్లాడుతూ సారంగపాణి చేసిన సేవలు కార్యాలయానికి మరువలేనివని పేర్కొన్నారు. కొత్త బాధ్యతల్లో ఆయన మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ హైమావతికి కూడా ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు అశ్విన్, ప్రసన్న, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొని సారంగపాణికి శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

**:తహశీల్దార్ లక్ష్మీ ప్రసన్న**



**విడవలూరు, జూన్ 15 ప్రభాతవార్త:** స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తహశీల్దార్ ఏ. లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సమస్యలను ప్రస్తావించి, వాటి పరిష్కారానికి సంబంధించి సూచనలు అందించారు. మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. జిల్లా అధికారులు కొన్ని ముఖ్యమైన అంశాలను వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్ కుమారి, వెంకటరమణమ్మ, డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణలత, మండల వ్యవసాయ అధికారి సిహెచ్ శ్రీలక్ష్మి, సూపర్వైజర్ సురేఖ, ఏపీఎం వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతుకు యూరియా అందించాలి



**దగదర్తి, జూన్ 15, ప్రభాతవార్త :** సాగులో ఉన్న ప్రతి రైతుకు యూరియాను తక్షణమే అందించాలని ఏపీ రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న ఎరువుల సమస్యలపై సోమవారం మండల రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ లాజరస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక యాప్ కారణంగా రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. రికార్డుల్లో పేర్లు ఉన్న రైతులకే యూరియా అందిస్తున్న అధికారులు చెబుతున్నారని, ప్రభుత్వ భూములు, చెరువు పోరంబోకు భూములు, ఇతర భూముల్లో సాగు చేస్తున్న కౌలుదారుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రత్యేక యాప్‌ను వెంటనే రద్దు చేసి, ప్రతి ఎకరాకు అవసరమైన మేర యూరియాను అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రైతు డిపోలలో యూరియా బస్తాను రూ.400లకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ అక్రమంగా అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గోపసాని రమేష్, మండల అధ్యక్షుడు గొల్లపల్లి వెంకటరమణయ్య, వంటేరు సుధాకర్, గోపసాని మధు, వెలినేని మహేష్ నాయుడు, చింతలబోయిన వెంకటేశ్వర్లు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకతే లక్ష్యం: చలపతి రావు



**కొడవలూరు, జూన్ 15ప్రభాతవార్త:**మండలంలోని యల్లయపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) , స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర సవరణ) అవగాహన కార్యక్ర మం నిర్వహించారు.ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియపై బీఎల్ఏలు సమర్థవంతంగా పని చేయాల్సిన అవసరాన్ని వివరించి వారికి దిశా–నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు వీరి. చలపతి రావు హాజరై ముఖ్య సూచనలు అందించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కమిటీ సభ్యులు గొల్లపల్లి విజయకుమార్, కొట్టె మల్లికార్జునరావు, కోడూరు మధుసూదన్ రెడ్డి, కొండూరు లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షి ంచారు.స్థానిక నాయకుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్ విధానంపై విస్తృతంగా చర్చ జరిగింది.

# నిర్దేశించిన పత్రాలతో సదరంకు హాజరు కావాలి



**కోవూరు, జూన్ 15ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి సోమవారం సదరం పరీక్షకు వచ్చే రోగులు తప్పనిసరిగా వారి దగ్గర ఉన్న ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ అమృత తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం 19 మందికి సద రం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదరంకు పరీక్షల నిమిత్తం వచ్చే రోగులు వారి దగ్గర ఉన్న పత్రాలతో పాటు హాస్పిటల్‌కు సంబంధించిన రిపోర్ట్ ఉంటే వాటిని కూడా తప్పక తీసుకు రావాలన్నారు.

# దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభకు పురస్కారం



**కోవూరు, జూన్ 15ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కోవూరు మండలానికి సంబంధించి నగదు, ప్రోత్సాహక బహుమతి, మెమెంటోను అందజేశారు. గుమ్మలదిబ్బ గ్రామంలో పముజుల సుధాకర్ కుమారుడు సుజయ్ 580 మార్కులు సాధించారు. అదేవిధంగా పడవల వెంకట సుబ్బయ్య కుమారుడు హెమ సుజయ్ శ్రీకర్ జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించడంతో ఇరువురికి 3,116లు నగదు, మెమెంటో , సర్టిఫికేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దేవాంగ సంక్షేమ సంఘం సంయుక్త కార్యదర్శి పులి సురేష్ మాట్లాడుతూ తమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభకు పదును పెట్టేలా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గారాబత్తిన శ్రీనివాసులు, పన్నెం సుధాకర్, మీడియా విభాగం అధ్యక్షుడు చల్లా మురళి, తదితరులు ఉన్నారు.

# అంగన్‌వాడీలోనే చిన్నారులకు మెరుగైన విద్యాబోధన



**కోవూరు, జూన్ 15ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్. నిర్మల తెలిపారు. కోవూరు మండలం వేగూరు పంచాయతీ వేగూరు కండ్రిగ గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కేంద్రాల్లో విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు వీడియో ద్వారా కూడా విజ్ఞాన పాఠాలను బోధించడం జరుగుతుందన్నారు. బలవర్ధకమైన పౌష్టికాహారం అందించే ఈ కేంద్రాలను తల్లులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు, తల్లులు ఉన్నారు.

# పిజిఆర్ఎస్ వచ్చిన అర్జీదారులు



**కోట,జూన్ 15 ప్రభాతవార్త :** కోట మండల తహిసీల్దార్ కార్యాలయూంలో సోమవారం (పిజిఆర్ఎస్) జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు వివిధ గ్రామాల నుంచి ప్రజలు తహిసీల్దార్ కె.జయజయరావుకు వినతి పత్రాలు అంద జేశారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపుతామని తహిసీల్దార్ జయజయరావు చెప్పారు.( పజల సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు.ఈ సమస్యల పరిష్కార వేదికలో ఎంపిడిఓ ఆర్.దీలిప్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తాలీం ఏ హునర్‌లో ఉత్తీర్ణులైన 250 మందికి

# అలాట్మెంట్ లెటర్ అందచేత



**నెల్లూరు, జూన్ 15, ప్రభాతవార్త – వైద్యం :** తాలీం ఏ హునర్ టాలెంట్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన 250 మంది విద్యార్థులకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు మైనారిటీ శాఖ మంత్రివర్యులు నస్యం మొహమ్మద్ ఫరూక్, ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారులు మొహమ్మద్ షరీఫ్, పార్లమెంటు సభ్యులు కేసినేని చిన్ని,శాసనసభ్యులు మొహమ్మద్ నశీర్, గద్దె రామ్మోహన్‌లు అలాట్మెంట్ లెటర్ అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు మోలానా ముస్తాక్ అహ్మద్, ఫరూక్ షుబ్లీ, నాగుల్ మీరా, ముక్తియార్, కమిషనర్ స్కూల్ ఎడ్యుకేషన్ తమీమ్ అన్సారియా, షరిన్ బేగం ఐపిఎస్, రిటైర్డ్ ఐపిఎస్ ఇక్బాల్, బ్రదర్ సిరాజ్, వక్ఫ్ బోర్డు సభ్యులు, రాష్ట్ర టీడీపీ మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

**తహశీల్దార్ స్ఫూర్తి రెడ్డి**



**కొడవలూరు, జూన్ 15ప్రభాతవార్త :** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావివ్వబోమని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఆమె మాట్లాడారు.ఈ సందర్భంగా పంట కాలువ ఆక్రమణ చేసి సాగునీటి ప్రవాహానికి అంతరాయం కలిగిస్తున్నారని ఆక్రమణ తొలిగించాలని రైతులు ఒక వినత పత్రం అందించగా, వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో 4అర్జీలు సమర్పించారు. అందిన అర్జీల పై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత శాఖల అధికారులకు పంపించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యానికి అవకాశం లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఏఎస్ఓ గాయత్రి, ఆర్ఐ హైమావతి, ఐసీడీఎస్ సూపర్వైజర్ కోటేశ్వరి, ఏపీఎం కృష్ణవేణి, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నెల్లూరు అంటే నారాయణ... నారాయణ అంటే అభివృద్ధి..

**– ప్రజా నాయకుడు మంత్రి పొంగూరు నారాయణ జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కిషోర్ గునుకుల, విజయలక్ష్మి గునుకుల**



**నెల్లూరు, జూన్ 15, ప్రభాతవార్త – కలెక్టరేట్ :** మున్సిపల్ శాఖ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద గుణుకుల కిషోర్, విజయలక్ష్మి గుణుకుల ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టి మంత్రి నారాయణ సేవా స్ఫూర్తిని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో పొంగూరు రమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కిషోర్ గునుకుల, విజయలక్ష్మి గునుకుల, ప్రశాంత్ గౌడ్, చంద్రయాదవ్, నాగేంద్ర బాలు, నవీన్, వేములు శివ కృష్ణ, వేముల హర, చిత్తూరు బాలాజీ, కర్రెద్దుల అశోక్, అమని, లత, నందిని, రజని, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## రసాయన రహిత ఆహారానికే ప్రాధాన్యం

**తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి**



**కొడవలూరు, జూన్ 15 ప్రభాతవార్త:** మండల తహశీల్దార్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటల అమ్మకాల కోసం ప్రత్యేక స్టాల్ను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏర్పాటు చేశారు. రైతుల నుంచి నేరుగా వినియోగదారులకు వివిధ రకాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహార పదార్థాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. రసాయన రహిత ఆహారాన్ని వినియోగించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.

## రెడ్ల ఐక్యవేధిక శాశ్వత సభ్యుల సర్వసభ్య సమావేశం



**నెల్లూరు కార్పోరేషన్, జూన్ 15 ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలోని శుభం కన్వెన్షన్ హాలులో సోమవారం రెడ్ల ఐక్యవేదిక శాశ్వత సభ్యుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యవర్గ విస్తరణ ఈనెలలో పుట్టిన శాశ్వతసభ్యుల పుట్టినరోజు వేడుకలు భాగంగా వైభవంగా సంస్థ అభివృద్ధికి పలువురు పలు రకాల సలహాలు,సూచనలు చేశారు. అనంతరంశాశ్వత సభ్యులను చేర్పించడం విధిగా పాటించాలన్నారు.శాశ్వత సభ్యులు విండోటి వినయ్‌రెడ్డి 5000, కల్లూరు రమణారెడ్డి 5000,పుచ్చలపల్లి శ్రీనివాసులురెడ్డి 5000, ఆనంద చండి రాణి 2000,నెల్లూరు సుజాతారెడ్డి 2000,అన్నపరెడ్డి సుబ్బారెడ్డి 3000రుపాయలు సహాయంతో ఆర్తికంగా వెనుకబడి ఇద్దరు విద్యార్థులకు రూ.21000 విద్యాసాయం కసం అందజేశారు. రెడ్లకు వైద్యసాయం అందిస్తున్న డాక్టర్లు క్రిష్టారెడ్డి, నిశ్చల్‌ప్రసాద్‌రెడ్డి, రాజేంద్రనాథ్‌రెడ్డిల సేవలను అభినందించారు.సుమారు 35మందితో కూడిన నూతన కార్యవర్గాన్ని క్రటించి పరచయం చేసి వారందరిని సన్మానించి అభినందనలు తెలిపారు.దొడ్ల గోపాల్‌రెడ్డి సంస్థ అభివృద్ధికి రూ.25వేలు డొనేషనల్ ఇచ్చారని తెలిపారు.

## అనారోగ్యంతో ఉన్న టీడీపీ నేత మధుసూదన్ రెడ్డిని పరామర్శించిన ఏకొల్లు పవన్ రెడ్డి



**ఇందుకూరుపేట, జూన్ 15, ప్రభాతవార్త:** ఇందుకూరుపేట మండలం నిడుముసలి గ్రామానికి చెందిన ప్రముఖ తెలుగుదేశం పార్టీ నాయకులు దువ్వూరు మధుసూదన్ రెడ్డి గత కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షులు ఏకొల్లు పవన్ రెడ్డి నిడుముసలి గ్రామంలోని మధుసూదన్ రెడ్డి నివాసానికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా పవన్ రెడ్డి మధుసూదన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి, త్వరలోనే వారు పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటుందని ఈ సందర్భంగా వారు భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, వివిధ గ్రామాల తెలుగుయువత నాయకులు, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చీర్లవారి కండ్రిక గ్రామానికి రహదారి మంజూరు చేయాలని వినతి



**చేజర్ల, జూన్ 15, ప్రభాతవార్త :** బీజేపీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు చేజర్ల మండల బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో జనతా వారధి కార్యక్రమంలో భాగంగా సోమవారం తహసీల్దార్ మస్తానయ్య అధ్యక్షతన జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీవో అమర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చీర్లవారికండ్రిక గ్రామానికి రహదారి అధ్వాన్నంగా ఉండడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రహదారి మొత్తం గుంతల మయంగా వాహనాలు వెళ్లలేని పరిస్థితిలో ఉందని కొద్దిపాటి వర్షానికి గుంతలలో వర్షపు నీరు చేరడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొని ఉందని తెలియజేశారు. అత్యవసర పరిస్థితులలో ఆ గ్రామ ప్రజలు విద్యార్థులు వైద్యం కోసం నెల్లూరుకి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వినతిపత్రం ద్వారా తెలియజేశారు. స్పందించిన ఎంపీడీవో సమస్య పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ బత్తల కిష్టయ్య, మండల బీజేవైఎం అధ్యక్షులు కుండా శివారెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు జగ్గారెడ్డి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు విజయ్ రెడ్డి, జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, ఓబీసీ నాయకులు పెంచలయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నిత్యం యోగాను సాధన చేయాలి




**కావలి, జూన్ 15 ప్రభాతవార్త :** ప్రతిరోజూ యోగాని సాధన చేయాలని,సాధన చేయడం వల్ల మానసికంగా,శారీరకంగా ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉంటారని ఏకాగ్రత, క్రమశిక్షణ, వృద్ధి చెందుతామని హెచ్‌ఎం సుజాత పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కావలి పాత ఊరు పురపాలక ఉన్నత పాఠశాలలో సోమవారం ఎన్‌సిసి అధికారి షేక్.మస్తాన్ వల్లి ఆధ్వర్యంలో యోగా గురువు గోపాల్ శిక్షణలో ఎన్‌సిసి క్యాడెట్స్‌కు యోగా శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కావలి హౌసింగ్ గోడౌన్‌లో భారీ కుంభకోణం విజిలెన్స్ పోలీస్ విచారణ జరిపించాలి



**కావలి, జూన్ 15 ప్రభాతవార్త :** కావలి ఒకటవ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా వినతుల వేధిక కార్యక్రమంలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో కావలి హౌసింగ్ గోడౌన్ కేంద్రంగా సిమెంటు, స్టీల్ పంపిణీలో జగనన్న ఇళ్ళ నిర్మాణాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని దీనిపై తక్షణమే విజిలెన్స్ పోలీస్ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్డీఓకు వినతిపత్రం అందేశారు. ఈసందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ పేదల ఇళ్ళ కోసం కేటాయించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుతావల నిధులను, మెటీరియల్‌ను గత ప్రభుత్వ పెద్దలు, కొందరు హౌసింగ్ అధికారులు కలిసి ఇష్టారాజ్యంగా దోచుకున్నారని మండిపడ్డారు. కావలి హౌసింగ్ గోడౌన్ నుండి సిమెంటు బస్తాలు, స్టీలు మాయమయ్యాయని దీనిపై హౌసింగ్ అధికారుల వద్ద స్పష్టమైన సమాదానం లేదని తెలిపారు. గోడౌన్‌లో సిమెంటు నిల్వలు లేకపోయినా ఇచ్చినట్లు చూపిస్తూ తప్పుడు లెక్కలు చూపించారన్నారు. దీంతో పేదలకు అందాల్సిన సబ్సిడీ కోల్పోయారన్నారు. ఈ సొమ్మును వారి ఖాతాల నుంచి కట్ చేసుకున్నారని మండిపడ్డారు. పిఎం అవాజ్‌యోజన నిధులను దుర్వినియోగం చేస్తూ నివాసయోగ్యం కాని నాసిరకం ఇళ్ళను కట్టబెట్టిన అధికారులు, కాంట్రాక్టర్లపై పోలీసు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు, జనతా వారది కావలి డివిజన్ ఇన్‌చార్జ్ కుట్టుబోయిన బ్రహ్మానందం, ఎస్‌సి మోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు పరుసు వెంకటేశ్వర్లు యువ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లపోతుల సాయిక్రిష్ణ, పట్టణ కార్యదర్శి మట్ట మల్లికార్జున, యువ మోర్చా పట్టణ అధ్యక్షులు మేదరమెట్ల మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు




**గూడూరు, జూన్ 15, ప్రభాతవార్త :** ఆటో డ్రైవర్లు నిబంధనలను పాటించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవు అని గూడూరు పట్టణ సిఐ శేఖర్ బాబు పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణ పరిధిలోని ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, అతి వేగంగా వెళ్లకూడదని సూచించారు. ఓవర్టేక్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు పాటించాలని డ్రైవింగ్ లైసెన్సు ఇన్సూరెన్స్ యూనిఫామ్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన, మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే గూడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పోలీసు,ఆర్టీవో అధికారులు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని పలు ఆటోలకు చలాన్లను విధించారు. ఈ కార్యక్రమంలో ఒకటవ పట్టణ సీఐ శేఖర్ బాబు, ఎస్ఐలు మనోజ్ కుమార్, ఎస్సై శిరీష, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శాంతి, వారి సిబ్బంది పాల్గొన్నారు.

## అల్లిగుంటపాలెంలో గడ్డివామి దగ్ధం



**కావలి, జూన్ 15 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం అల్లిగుంటపాలెంకు చెందిన రైతు బండ్ల దయాకర్‌కు చెందిన గడ్డివామి సోమవారం అగ్నికి ఆహుతి అయ్యింది. ఈ ప్రమాదంలో సుమారు 650మోపుల గడ్డి బూడిదపాలు అవడంతో రైతు దయాకర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేవారు. ఈ ప్రమాదంలో గడ్డివామి విలువ సుమారు రూ.80వేల నుండి లక్ష వరకు ఉంటుందని అంచనా వేశారు. గడ్డివామి దగ్ధం కావడంతో తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం నుంచి వెంటనే తమకు ఆర్తికసాయం చేయాలని రైతు కన్నీరుమున్నీరు అవుతున్నాడు.

**గ్రామ పంచాయితీ కార్యాలయము, జొన్నవాడ**
బుచ్చిరెడ్డిపాళెం మండలం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

ఆర్.ఓ.సి.నెం.08/2026 తేది: 25.06.2026

**టెండరు ప్రకటన**

తేది.25.06.2026 న ఉదయం 11.00 గంటలకు జొన్నవాడ గ్రామ పంచాయితీ కార్యాలయము నందు జొన్నవాడ గ్రామంకు వచ్చు ప్రైవేటు వాహనముల నుండి రుసుము వసూలు చేయు హక్కు 2026-2027 సంవత్సరమునకు బహిరంగ వేలం జరుపబడును.

| వ.నెం. | వేలం వివరములు | నిర్ణయించిన మద్దతు ధర | లీజు కాలము | ధరావత్తు చెల్లించవలసిన మొత్తము |
| --- | --- | --- | --- | --- |
| 1 | ప్రైవేటు వాహనముల నుండి రుసుము వసూలు హక్కు | 4,10,000/- | వేలం తేది నుండి 30.06.2027 వరకు | 25,000/- |

1. బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వ్యక్తి నేరుగా హాజరై ధరావత్తు చెల్లించి వేలం నందు పాల్గొనవలెను.
2. వేలం శ్రీ డివిజనల్ పంచాయితీ అధికారి నెల్లూరు వారు ఉత్తర్వులు అనుసరించి జరుపబడును. (ఆర్.ఓ.సి. నెం.226/2026-డి, తేది. 01.06.2026)
3. ఇతర వివరములు కార్యాలయం పని వేళల్లోసెలవు అయిన మరునటి కార్యాలయపు పని రోజుల్లో బహిరంగ వేలం నిర్వహించబడును.

సం/- యం.కావేరి, పంచాయితీ కార్యదర్శి, జొన్నవాడ

**శ్రీ ధర్మరాజ స్వామి వారి దేవస్థానము**
గూడూరు టౌన్ & మండలం, తిరుపతి జిల్లా

ప్రకటన నెం. నిల్/2026 తేది: 15.06.2026

**సీల్డ్ టెండరు మరియు బహిరంగ వేలం ప్రకటన**

పై దేవస్థానము పూర్తి హక్కు అనుభవము కలిగిన ద్రౌపతి దేవి కాంప్లెక్స్ నందు గల షాప్ నెం - 29 నకు సీల్డ్ టెండర్లు మరియు బహిరంగ వేలం పాటలు, పై దేవస్థానము వద్ద తేది. 27-06-2026 న ఉదయం 10:30 ని" లకు నిర్వహించబడును. సదరు టెండరు షెడ్యూలు కొరకు రూ.500/- లు చెల్లించి ప్రకటన తేది నుండి తేది: 26-06-2026 సాయంత్రం 05:00 గం॥ల లోపు పై దేవస్థాన కార్యాలయము నందు టెండర్ షెడ్యూల్ పొందవచ్చును. ధరావత్తుతో పాటు టెండర్ షెడ్యూల్ తేది: 27-06-2026 ఉదయం 09:00 గం॥ ల లోపు టెండరు బాక్సు నందు వేయవలెను. అదే రోజు ఉదయం 10:30 ని॥లకు దేవాదాయ శాఖ అధికారులు సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడును. ఈ క్రింది లైసెన్సు హక్కులకు పాట తెగిన వెంటనే ధరావత్తులతో కలుపుకొని "6" నెలల అద్దె మొత్తం ముందుగా చెల్లించవలెను. తదుపరి ఆమోదం కొరకు ఉన్న తాధికారులకు పంపబడును.

| వ.నెం. | లైసెన్సు వివరములు | ప్రథమ ధరావత్తు | కాలపరిమితి |
| --- | --- | --- | --- |
| 1 | ద్రౌపతి దేవి కాంప్లెక్స్ నందు గల షాప్ నెం.29 | రూ. 5,00,000/- | 2026-27 నుండి 2028-29 వరకు అనగా "3" సం॥ |

పూర్తి వివరములకు పై దేవస్థాన కార్యాలయము నందు సంప్రదించవలెను

చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి
కార్యనిర్వాహణాధికారి సెల్ 91-7981294396

## మిన్నంటిన మంత్రి నారాయణ జన్మదిన వేడుకలు



**నెల్లూరు, జూన్ 15, ప్రభాతవార్త - వైద్యం :** రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ 69 వ జన్మదిన వేడుకలు నెల్లూరు సిటీ నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల సంబరాల మధ్య అత్యంత ఘనంగా జరిగాయి. చింతారెడ్డిపాలెంలోని నారాయణ మెడికల్ కాలేజ్ ప్రాంగణంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంత్రి అల్లుడు గంటా రవితేజ, కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 101 టెంకాయలు కొట్టి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆ తర్వాత జిల్లా టీడీపీ కార్యాలయంలో పార్టీ నేతలు బాలాజీ, జమీర్, తిరుమల నాయుడు ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. మంత్రి నారాయణ చిత్రపటానికి డ్రోన్ ద్వారా పాలాభిషేకం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.వేడుకలకు ముఖ్య అతిదులుగా వచ్చిన మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి, అల్లుడు గంటా రవితేజ పార్టీ ముఖ్య నేతలు, కుటుంబ సభ్యులతో కలిసి నాయకులు ఏర్పాటు చేసిన 69 కేజీల భారీ కేక్‌ను కట్ చేశారు. నగరవ్యాప్తంగా భారీగా బాణాసంచా కాలుస్తూ కూటమి కార్యకర్తలు మిన్నంటేలా సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, మేయర్ సుజాతా అశోక్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు తదితర నేతలు పాల్గొని మంత్రి సేవాగుణాన్ని కొనియాడారు. కేవలం నెల్లూరులోనే కాకుండా అమెరికా, లండన్, జర్మనీ, సింగపూర్‌లలో సైతం మంత్రి జన్మదిన వేడుకలను అభిమానులు నిర్వహించారు. అనంతరం మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి నగరంలోని పలు డివిజన్లలో విస్తృతంగా పర్యటించారు. 44వ డివిజన్ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ అశోక్ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమాల్లో, 45వ డివిజన్ విజయమహల్ గేట్ వద్ద పోకల రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో 46వ డివిజన్ జనసేన నేత గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో ట్రంక్ రోడ్డులోని హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద జరిగిన కేక్ కటింగ్, సేవా కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కటింగ్ చేశారు. రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు ఆధ్వర్యంలో కాన్సర్ హాస్పిటల్ లో నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 15వ డివిజన్‌లో పెంచల్ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన మంత్రి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. 54వ డివిజన్ జనార్దన్ రెడ్డి కాలనీలో నారాయణ నేత్రజ్యోతి, దంతసురక్ష మెడికల్ క్యాంపు వద్ద జమీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్నారు. 52వ డివిజన్ రంగనాయకుల పేటలో ఇక్బాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. లీలా మహల్ సెంటర్, మూలాపేట సెంటర్, పెద్దబజారు సెంటర్‌లలో స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగూరు రమాదేవి మాట్లాడుతూ మంత్రి నారాయణ ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్నప్పటికీ, ఆయన జన్మదిన సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రతి డివిజన్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహించటం చాలా సంతోషంగా ఉందన్నారు. నారాయణ ఎల్లప్పుడూ ప్రజాసేవకే మొదటి ప్రాధాన్యత ఇచ్చే జనం మనిషి అని, అత్యధిక మెజారిటీ ఇచ్చిన సిటీ వాసుల రుణం తీర్చుకునేందుకు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కార్యకర్తల సంక్షేమం కోసం ఏడాదికి 10 కోట్లు వెచ్చిస్తూ సిటీ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారని వివరించారు. మంత్రి అల్లుడు గంటా రవితేజ మాట్లాడుతూ అభివృద్ధే అజెండాగా ముందుకు సాగుతున్న మంత్రి నారాయణ తన సేవాతత్పరతతో పేదల హృదయాల్లో పదిలమైన స్థానం సంపాదించుకున్నారని, సిటీ వాసులకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని స్పష్టం చేశారు.

## సాంప్రదాయబద్ధంగా పల్లకి సేవ



**కోవూరు, జూన్ 15ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారం ప్రాత:కాలమునే స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి శివభక్త బృందం ఆధ్వర్యంలో పల్లకి సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివ భక్త బృందం సభ్యులు సుకుమార్, జనార్ధన్, మోహన్, శ్రీనివాసులు, పెద్ద సంఖ్యలో భక్తులు ఉన్నారు.

## ఉదయగిరి తహసీల్దార్‌గా రామ్మోహన్ బాధ్యతలు స్వీకరణ



**ఉదయగిరి, జూన్ 15, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలో గతంలో పని చేసి పదోన్నతిపై మార్కాపురం జిల్లాకు బదిలీపై వెళ్లి ఎల్. రామ్మోహన్ తిరిగి ఉదయగిరి తహసీల్దార్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమానికి ఓటర్లు సహకరించాలన్నారు. ఓటర్లు తమ ఓటుతో మార్పులు చేర్పులు వంటి వివరాలను బూత్ లెవల్ అధికారులకు అందించాలన్నారు.

## యాదవ సమాజంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వినతి



**దగదర్తి, జూన్ 15, ప్రభాతవార్త :** సోషల్ మీడియా వేదికగా యాదవ సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చిలకపాటి మధుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దగదర్తి పోలీసు స్టేషన్‌లో యాదవ సంఘం నాయకులు సోమవారం ఎస్సై మహేంద్రకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సామాజిక వర్గాల మనోభావాలను దెబ్బతీసే విధంగా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేయడం సమాజంలో విభేధాలకు దారి తీస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలును ఉపేక్షించేకుండా సంబంధిత వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెలినేని మహేష్ నాయుడు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చింతలబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, యూత్ అధ్యక్షులు వట్టికాళ్ల మాధవరావు యాదవ్, బీసీ సెల్ అధ్యక్షులు పల్లవరం సురేంద్ర యాదవ్, మాజీ సర్పంచ్ వట్టికాళ్ల రవీంద్ర యాదవ్, అల్లం శ్రీనివాసులు యాదవ్, వట్టూరు కిశోర్ యాదవ్, జి.మాధవ యాదవ్, దేగ మహేష్ యాదవ్, రాజేష్, మహేంద్ర, మనోజ్, వెంకట నరసయ్య, రఘువర్ధన్, మేకల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వర్గీయ చింతల శేషారెడ్డి వర్ధంతి



**కావలి, జూన్ 15 ప్రభాతవార్త :** స్వర్గీయ చింతల శేషారెడ్డి 46వ వర్ధంతి కార్యక్రమం రూరల్ మండలం గౌరవరం గ్రామంలో సోమవారం జరిగింది. ఈకార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడాతూ జూన్ 15న 1979లో జిల్లా రైతాంగ సమస్యల పరిష్కరించాలని, తుఫాన్‌లో దెబ్బతిన్న రైతులకు న్యాయం చేయాలని బంద్ సందర్భంగా అప్పట్లో జరిగిన కాల్పుల్లో చింతం శేషారెడ్డి అమరులైనారన్నారు. ఇప్పటికి ఆనాటి రైతాంగ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కాంప్లెక్స్ ఎరువులు ధరలు పెరిగాయన్నారు. తక్షణమే ఆ యూరియా యాప్‌ను రద్దు చేయాలని పెంచిన కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గించాలని కోరారు. శేషారెడ్డి కుమార్తె మాధవి మాట్లాడుతూ రైతుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈకార్యక్రమంల కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కె.జాన్, సిఐటియు నాయకులు అమీర్‌బాష, చింతం శేషారెడ్డి కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి, సతీమణి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ అప్‌డేట్ చేసుకుంటేనే యూరియా పంపిణీ

**- నిడుముసలి పీఏసీఎస్ సీఈఓ ప్రతాప్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ**




**- ముదివర్తిపాలెం, లేబూరు, నిడుముసలి గ్రామాల్లో నిల్వలు సమృద్ధి**

**ఇందుకూరుపేట, జూన్ 15, ప్రభాతవార్త :** రైతులు తమకు కావలసిన యూరియా (ఎరువులు) పొందాలంటే ఖచ్చితంగా ఆధార్ కార్డు వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఇందుకూరుపేట మండలం నిడుముసలి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రతాప్ కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం నిడుముసలి సహకార సంఘం పరిధిలోకి రైతులు పెద్ద సంఖ్యలో యూరియా కోసం వస్తున్నారని, అయితే కొంతమంది రైతులకు ఆధార్ కార్డులు అప్‌డేట్ కాకపోవడం వల్ల సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన వివరించారు. ఈ బయోమెట్రిక్ లేదా ఆధార్ అనుసంధాన సమస్యల వల్లే ప్రస్తుతం వారికి యూరియా పంపిణీ చేయలేకపోతున్నామని స్పష్టం చేశారు.

**- సచివాలయాల్లో అప్‌డేట్ చేసుకోవాలి:** ఆధార్ కార్డు అప్‌డేట్ కాని రైతులు వెంటనే తమ పరిధిలోని గ్రామ సచివాలయాలకు వెళ్లి వేలిముద్రలు లేదా ఇతర వివరాలను అప్‌డేట్ చేయించుకోవాలని సీఈఓ కోరారు. సచివాలయంలో ప్రక్రియ పూర్తి చేసుకుని, ఆధార్ కార్డుతో సొసైటీకి వస్తే ఎలాంటి ఆలస్యం లేకుండా తక్షణమే యూరియాను అందజేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

**- సమృద్ధిగా ఎరువుల నిల్వలు - ఆందోళన వద్దు:** మండలంలోని లేబూరు, నిడుముసలి, ముదివర్తిపాలెం గ్రామాల్లో రైతులకు అవసరమైన యూరియా నిల్వలు పూర్తి స్థాయిలో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని ప్రతాప్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎరువుల కొరత అంటూ ఏమీ లేదని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్హులైన ప్రతి రైతుకూ ఎరువులు అందుతాయని, కేవలం నిబంధనల ప్రకారం ఆధార్ అప్‌డేషన్ ప్రక్రియను పూర్తి చేసి సహకార సంఘం సిబ్బందికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## గ్రామీణ ప్రజల ఆరోగ్యమే లక్ష్యం



**తోటపల్లి గూడూరు, జూన్ 15, ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ డాక్టర్ రాధిక విశేష సేవలు అందిస్తున్నారు. నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలు మెరుగైన వైద్యం పొందాలనే ఉద్దేశంతో గ్రామ స్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తోటపల్లి గూడూరు మండలం వరిగొండ పంచాయతీ పరిధిలోని గమళ్లపాలెంలో వరిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 50 మంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్, థైరాయిడ్, మలేరియా, డెంగీ తదితర 14 రకాల వ్యాధులకు రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలకు ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. అలాగే వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధులు, చిన్నారులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించారు. ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్య అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాధిక సేవలను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్హెచ్‌పీ కావ్యలత, ఏఎన్ఎం రజనికుమారి, మేల్ హెల్త్ అసిస్టెంట్ మస్తాన్, ఆశా కార్యకర్తలు హబీ, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చెరువు ఆక్రమణలను అరికట్టండి



**నెల్లూరు, జూన్ 15, ప్రభాతవార్త - కలెక్టరేట్ :** నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లె బిట్టు వన్ గ్రామ ఊట చెరువు ఆక్రమణలను అరికట్టాలని ఆ గ్రామానికి చెందిన మునమాల శ్రీనివాసులు రెడ్డి మునుమాల రమణా రెడ్డిలు సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా గ్రామ ఓటచెరువు 1986లో 12 ఎకరముల 98 సెంట్లు విస్తీర్ణంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అయితే అప్పటినుంచి మా గ్రామానికి చెందిన పలువురు రైతులు మట్టి తోలుకునే నెపంతో ఆక్రమించుకొనుచున్నారని వారు ఆరోపించారు. చెరువును ధ్వంసం చేసి అధికారులను మభ్యపెట్టి ఆన్లైన్‌లో పేర్లు నమోదు చేసుకుంటున్నారు. అన్నారు గతంలో జెసి ఈ చెరువును పరిశీలించి ఆక్రమణలను గుర్తించి 144 సెక్షన్ విధించి ప్రభుత్వం తరఫున బోర్డు కూడా ఏర్పాటు చేశారన్నారు దాంతో ఈ చెరువులో ఎవరు ఆక్రమించుకోకుండా ప్రభుత్వం తగు చర్యలను చేపట్టింది అయితే అక్రమార్కులు మరలా ఆక్రమించుకొనుటకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు అన్నారు చెరువును కాపాడాలని వారు కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేతా వెంకటేశ్వర రెడ్డి, కేతా వేముల రెడ్డి, మొరం వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులు స్వీకరించిన పోలీస్ ఉన్నతాధికారులు



**నెల్లూరు క్రైమ్, జూన్ 15, ప్రభాతవార్త :** ప్రజా సమస్యలను సత్వరంగా పరిష్కరించడంతో పాటు, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా విచారించి న్యాయం చేయాలని జిల్లా అడిషనల్ ఎస్‌పి సిహెచ్ సౌజన్య సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా వినతులు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం జిల్లా ఇంచార్జి ఎస్‌పి వి. హర్ష వర్ధన్ రాజు ఆదేశాలు మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ఇతర అధికారుల సమక్షంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి 132 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పట్ల ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, ప్రజలతో మర్యాద పూర్వకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. ప్రతి పిటిషన్‌ను సమగ్రంగా విచారించి త్వరితగతిన పరిష్కరించాలని, బాధితులకు చట్టపరమైన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలి అని ఈ సందర్భంగా జూమ్ వీసీ ద్వారా పోలీస్ అధికారులకు సూచనలు ఇచ్చారు. టీపీ గూడూరు పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన మహిళా, తన ఇంటి సమీపంలో ఉన్న అన్నబత్తిన వేణు తనని మానసికంగా శారీరకంగా వేదిస్తునట్టు, తనను చెడు ఉద్యేశంతో వెంటపడి ఇబ్బందులకు గురిచేస్తునట్టు విచారించి న్యాయం చేయమని పిర్యాది కోరారు. వేదాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన మహిళా, తన అత్తమామలు అదనపు కట్నం కోసం తనను వేధించి ఇంటి నుంచి తరిమివేసినట్టు విచారించి న్యాయం చేయమని పిర్యాది కోరారు. కోట పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన పిర్యాది, తన స్నేహితుని ద్వారా రైల్వే శాఖలో విధులు నిర్వర్తిస్తున్న చేపల గంగాధరుడు అనే వ్యక్తి, రైల్వేలో గ్రూప్ డి ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 9 లక్షలు తీసుకొని ఇప్పించకుండా అడిగితే తన అనుచరుల ద్వారా బెదిరిస్తునట్టు విచారించి న్యాయం చేయమని పిర్యాది కోరారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ స్టేషన్ సీఐ సుబ్బారావు, పిసిఆర్ సీఐ భక్తవత్సల రెడ్డి, ఎస్బి 2 సీఐ శ్రీనివాసులు రెడ్డి, పీజీఆర్ఎస్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన లేవుట్లను తనిఖీ చేసిన కమిషనర్ వైఓ.నందన్



**నెల్లూరు కార్పోరేషన్, జూన్ 15 ప్రభాతవార్త :** నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ.నందన్ స్తానిక అల్లీపురంలోని అంజనాలేవుట్లను 4వ మైలు కొత్త కాలువ ప్రాంతాల్లో నూతనంగా లేవుట్లును టౌన్‌ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్‌తో కలసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్బంగా లేవుట్ల నిర్మాణానికి అవసరమైన అనుమతులు, ప్లాను తదితర పత్రాలను కమిషనర్ తనిఖీ చేసి లేఅవుట్ నిర్వాహకులకు వివిధ సూచనలు జారీ చేశారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రహరీ, రోడ్లు, డ్రైన్ కాలువలు, విద్యుత్, వీధిదీపాలు, ఇతర మౌళిక వసతులపై చర్చించారు. అనుమతించిన మేరకు మాత్రమే లేవుట్ల నిర్మాణం జరిగేలా పర్యవేక్షించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లాన్ రఘునాథ్‌రావు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు సిబ్బది పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్దులకు తహసిల్దారు నగదు బహుకరణ



**బుచ్చి జూన్ 15 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని బెజవాడ బుజ్జమ్మ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 580 మార్కులు సాధించిన 4 గురు బాదలికలకు తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు ఒక్కొక్కరికి 5 వేల వంతున 20 వేలు వారిని ప్రోత్సహిస్తు అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు బెజవాడ బుజ్జిమ్మ కళాశాలలో విద్యార్దులు సాధిస్తున్న ఫలితాలు చూస్తుంటే చాలా ముచ్చటేస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిని బాలికలు ఇంత మంచి మార్కులు సాధించడం అభినందనీయమని అన్నారు. పేద ప్రజల్ని ఆదుకోవడంలో దొడ్ల కోదండరామిరెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడా రు.అనంతరం పెద్దలు బెజవాడ శ్రీనాద్‌రెడ్డి విద్యార్దులను అభినందిం చా రు.అనంతరం తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లును ఎంఇం దిలీప్‌కుమార్, ఎంఇఒ రత్నం, ప్రధా నోపాధ్యాయురాలు సుజాతమ్మ,టీచర్లు, విద్యార్దులు తహసిల్దాను సన్మానించారు.

## గిరిజనులకు ఎల్లవేలలా అండగా ఉంటా.. ఎమ్మెల్యే



**కావలి, జూన్ 15 ప్రభాతవార్త :** గిరిజనులకు ఎల్లవేలలా అండగా ఉండి అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రజాదర్బార్‌లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మొగిలి కల్లయ్య బోగోలు మండలం పాత బిట్రగుంట గ్రామానికి చెందిన గిరిజనులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు తమ ఉపాధి, జీనవోపాదికి సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఎస్‌టి కార్పోరేషన్‌చే ప్రభుత్వ ప్రోత్సాహకపథకాలు అందితే తమ కుటుంబాల ఆర్తిక పరిస్థితి మెరుగుపడుతుందని వివరించడం జరిగిందన్నారు. గిరిజనులకు ప్రత్యేకంగా మంజూరు చేయడంతపాటు వారి వృత్తులకు అవసరమైన పరికరాలు, వాహనాలు అందించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ అంశాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అర్హులైన గిరిజ నులకు ప్రభుత్వం పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్దికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

## దారి కోసం రెండోసారి కలెక్టర్‌ను కలిసిన గిరిజనులు

**నెల్లూరు, జూన్ 15, ప్రభాతవార్త – కలెక్టరేట్** గత 40 సంవత్సరాల నుంచి దారి లేకపోవడంతో కోట పంచాయతీలోని దామరగుంట గిరిజనులు నరకయాతన పడుతున్నారు. ఈ నేపథ్యంలో గత నెలలో దామరగుంట గిరిజనులు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తమకు దారి చూపాలని ఆ వినతిపత్రంలో గిరిజనులు కోరారు. ఆ నేపథ్యంలో అధికారులు వచ్చి దారి చూపుతారని గిరిజనులకు భరోసా ఇచ్చారు. అందుకు సంబంధించిన పత్రాలను సైతం ఇటీవల కోట రెవెన్యూ కార్యాలయానికి చేరాయి. అయినా దారి చూపడంలో స్థానిక రెవెన్యూ అధికారులు జాప్యం చేస్తుండటంతో ఆ గిరిజనులు మళ్లీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో కలెక్టర్ మాట్లాడుతూ నేను చెప్పానని తహశీల్దార్‌ను కలవాలని సూచించారని గిరిజనులు తెలిపారు. రిజిస్టర్డ్ డాక్యుమెంట్‌లో డొంక, బండ్ల బాట అని స్పష్టంగా ఉన్నా అధికారులు ఎందుకు దారి చూపడం లేదని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు.

**తహశీల్దార్ వివరణ** కోటలోని దామరగుంట గిరిజనులకు దారి విషయమై రెండోసారి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేయడంపై తహశీల్దార్ కె.జయజయరావును 'ప్రభాతవార్త' వివరణ కోరగా, గత నెలలో కూడా గిరిజనులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారని చెప్పారు. తనకు కలెక్టర్ కార్యాలయం నుంచి గిరిజనులు అందజేసిన వినతిపత్రం కూడా వచ్చాయని చెప్పారు. విచారించి కలెక్టర్‌కు నివేదిక పంపుతామని చెప్పారు.

## ఎన్నికల సిబ్బందికి ప్రజలు సహకారాన్ని అందించండి

### సమగ్ర ఓటు పరిశీలనపై ఇంటింటికి బిఎల్‌ఓలు



**నెల్లూరు కార్పోరేషన్, జూన్ 15 ప్రభాతవార్త** : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ సిటీ నియోజకవర్గం పరిధిలోని బూతు లెవల్ ఏజెంటులు, ఎన్నికల సిబ్బంది సోమవారం నుంచి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా (ఎస్ఐఆర్) పరిశీలనపై ఇంటింటికి తిరిగి సమాచారాన్ని సేకరిస్తారని ప్రజలంతా వారికి సహకరించి ఓటరు జాబితాను పూ ర్తి స్తాయిలో సిద్దం చేసేందుకు దోహదపడాలని కమిషనర్ వైఓ.నందన్ ఆకాంక్షించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో కమిషనర్ ఈఆర్‌ఓవై నందన్ ప్రజా సమస్యల పరిష్కారం వేధిక నిర్వహణ సందర్బంగా విలేకర్లతో సోమవారం మాట్లాడారు. ఈ సందర్బంగా ఈఆర్‌ఓ మాట్లాడుతూ బిఎల్‌ఓలు అందరూ తమ పరిధికి సంబంధించి రెండు రకాల ఎన్యూమరేటర్ ఫారంలను అందుకుని ఇంటింటి సర్వేలో నేటి నుంచి పాల్గొంటున్నారని ఆ ఫారాలను పూర్తి చేసి ఎన్నికల సిబ్బందికి సమర్పించాలని ప్రజలకు సూచించారు. కుటుంబలో 18ఏళ్ళు నిండిన పౌరులకు నూతన ఓటర్‌గా చేర్చడం, మరణించిన వ్యక్తులను ఓటరు జాబితా నుంచి తొలగించడం శాశ్వతంగా తరలిపోయిన వారిని ఓటర్ జాబితా నుంచి తొలగించడం పేర్లలో మార్పులు,ఫోటోలు మార్పులు తదితర అంశాలను ఈ ప్రక్రియ ద్వారా చేపట్టనున్నటుల ఈఆర్‌ఓ స్పష్టం చేశారు.ఓటర్లు సేవలు అందించేందుకు గానూ నియోజకవర్గ స్తాయిలో ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే 1950 సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు.

## చికెన్ వ్యర్థాల వాహనానికి బ్రేక్

### :కూనం పాడు వద్ద పట్టివేత.. కేసు నమోదు చేసి కోర్టుకు తరలింపు





**కొడవలూరు, జూన్ 15 ప్రభాతవార్త:** బెంగుళూరు నుంచి చికెన్ వ్యర్థాలను తీసుకొచ్చిన ఓ వాహనాన్ని సోమవారం కొడ వలూరు పోలీసులు పట్టుకునిసీజ్ చేశారు. తల మంచి పంచాయతీ పరిధిలోని కూనంపాడు గ్రామం వద్ద ఉన్న చేపల చెరువులకు వ్యర్థాలను తరలిస్తుండగా సమాచారం అందడంతో తనిఖీలు చేపట్టిన పోలీ సులు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసి న్యాయస్థానానికి తరలించినట్లు కొడవలూరు పోలీసులు తెలిపారు.

## నేడు రామతీర్థం బీచ్ వద్ద సామూహిక యోగా - కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 15, ప్రభాతవార్త** ప్రముఖ పర్యాటక కేంద్రమైన విడవలూరు మండలం రామతీర్థం బీచ్ వద్ద మంగళవారం ఉదయం 6 గంటలకు సామూహిక యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల 7న నెల్లూరు నగరంలోని స్వర్ణాల చెరువు వద్ద, 8న రామతీర్థం వద్ద, 12న రెసిడెన్షియల్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో థీమాటిక్ యోగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. మానసిక ఆనందానికి, శారీరక దృఢత్వానికి యోగా ఒక దివ్యౌషధమని, ప్రజలందరూ ఈ సామూహిక యోగా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని యోగాపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

## రామిశెట్టి వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం



**బిట్రగుంట జూన్ 15 ప్రభాతవార్త** రామిశెట్టి వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని కొండ బిట్రగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.ప్రసాదరావు పేర్కొన్నారు. బోగోలు మండలం కొండ బిట్రగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం రామిశెట్టి వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రామిశెట్టి వెంకట సుబ్బారావు జన్మదిన వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. మండలప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల లో పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ మద్దూలూరి ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన ఎవేడుకల్లో రామిశెట్టి సుబ్బారావు పుట్టినరోజు సందర్బంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ట్రస్ట్ ఆర్గనైజర్ మెతుకు రాజేశ్వరి విద్యార్థుల కు నోట్ బుక్స్ పంపిణీ చేసారు. ఈ సందర్బంగా రాజేశ్వరమ్మ మాట్లాడుతూ రామిశెట్టి సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ తరుపున ఎన్నో సేవ కార్యక్రమాలు జరుపనున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయని సిహెచ్.సుజాత, ఉపాధ్యాయులు బ్రహ్మయ్య,విజయలక్ష్మి ఓం శ్రీ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజావైద్యులు డాక్టర్ ప్రభాకర్ నాయుడు సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్యే





**కావలి, జూన్ 15 ప్రభాతవార్త :** వైద్యరంగంలోనే కాకుండా సామాజిక సేవాకార్యక్రమాలలో నూకావలి మాజీ మున్సిపల్ ఛైర్మెన్, ప్రజావైద్యులు డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే దగు మాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. డాక్టర్ ప్రభాకర్‌నాయుడు 89వ జన్మదిన వేడుకలు సోమవారం పట్టణంలోని ఆయ న నివాసంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని కేక్‌కట్‌చేసి శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రజలకు చేరువుగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని కొనియాడారు. ప్రభాకర్‌నాయుడు జన్మదిన వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. వైద్యునిగా కాకుండా మానవతావాదిగా, సేవామూర్తిగా సమాజానికి ఆయన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. కులమత ప్రాంత బేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరిని ఆదరించే వ్యక్తితం కలిగిన వ్యక్తి అన్నారు. ప్రజల పట్ల ప్రేమ, మానవీయ విలువలు ఆయనను ప్రత్యేక వ్యక్తిగా నిలబెట్టాయని తెలిపారు. ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు మార్గదర్శకంగా ఉండాలనా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వైద్యులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పట్టణ ప్రజలు పాల్గొని డాక్టర్ ప్రభాకర్ నాయుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## డాక్టర్ ప్రభాకర్‌నాయుడు 89వ జన్మదిన వేడుకలు



**కావలి, జూన్ 15 ప్రభాతవార్త :** ప్రజా వైద్యుకలు మాజీ మున్సిపల్ ఛైరెమన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు 89వ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కావలి స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు ఎస్‌కె.బాష ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, సామాజిక సేవకులు కేక్‌కట్ చేసి పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రంలో వక్తలు మాట్లాడుతూ ప్రభాకర్‌నాయుడు పేద, బడుగు, బలహీన, వర్గాలకు ఎన్నో విదాల సేవలందిసూత ఎన్నో ఉచిత వైద్యశిభిరాలను ఏర్పాట చేసి వైద్యాన్ని అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాయపాటి దిలీప్‌కుమార్, మొఘల్ సలీంబేగ్, దామ మధుసూదన్‌రావు, మొఘల్ శిరాజ్ బేగ్, నందిపాటి రమేష్, ఎం.మాలకొండారెడ్డి మారుతిరావు,బ్రహ్మయ్య అజిత్‌బాబు, రమణయ్య, ఘని,బాష, శారద, నాగరాజు, మహబూబ్‌బాషా, మస్తానయ్య, జమీర్, ప్రభయ్య, రామచంద్రయ్య, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## మేఘనను ఆదర్శంగా తీసుకోవాలి



**కోవూరు, జూన్ 15ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు సంబంధించిన 10వ తరగతి విద్యార్థిని ఎం. మేఘన ఇటీవల ప్రకటించిన ఐఐఐటీ ఫలితాల్లో శ్రీకాకుళం ఐఐఐటీలో సీటు సాధించింది. ఈ మేరకు సోమవారం పాఠశాల కార్యాలయంలో మేఘనను అభినందించారు. ఈ సందర్బంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి మాట్లాడుతూ 10వ తరగతిలో మేఘన మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు మరింత పేరు ప్రతిష్టలు తేవడమే కాకుండా ఇటీవల ప్రకటించిన ఐఐఐటీలో కూడా సీటు సాధించి పాఠశాల పేరు ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేశారన్నారు. 600కు గానూ 570 మార్కులు సాధించిన మేఘనను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ షాహిన, మేఘన తల్లి ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన బోధన



**కోవూరు, జూన్ 15ప్రభాతవార్త** : ప్రభుత్వ పాఠ శాలల్లోనే విద్యార్థులకు అవసరమైన నాణ్యమైన బోధన అందిస్తున్నారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ అ న్నారు. కోవూరు మండలం వేగూరు , ఇనమ డుగు తదితర ప్రాంతాల్లో సోమవారం ఆమె విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రస్తుతం ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ర్థులకు నాణ్యమైన బోధన అందిస్తున్నారన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను ఉచితంగా పంపిణీ చేయడమే కాకుండా బల వర్ధకమైన పౌష్టికాహారం, క్రీడా ప్రాంగణం కూడా కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉందన్నారు. ఇటువంటి మంచి అవకాశాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు ఉన్నారు.

## తాటిచెట్టును ఢీకున్న బైకు, ఒకరికి తీవ్రగాయాలు





**సంగం జూన్ 15 ప్రభాతవార్త** సంగం మండలంలోని కొరిమెర్ల సమీపంలో రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. సంగం నుండి హసనాపురం వైపు వెళ్తు ప్రమాద వశాత్తు బైకు తాటి చెట్టును ఢీకొంది. ఈ సంఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలు కాగా అతనిని వైద్య శాలకు తరలించారు.

## అత్యంత ప్రమాదకరమైన గడ్డి మందు సేవించిన రోగిని కాపాడిన మెడికవర్ వైద్యులు : డాక్టర్ రవీంద్ర రెడ్డి



**నెల్లూరు, జూన్ 15, ప్రభాతవార్త – వైద్యం** వ్యవసాయ రంగంలో విస్తృతంగా ఉపయోగించే అత్యంత ప్రమాదకరమైన హెర్బిసైడ్ పారాక్వాట్ (గడ్డి మందు) విషప్రయోగానికి గురైన ఓ వ్యక్తిని ప్రాణా పాయం నుంచి కాపాడుతూ నెల్లూరు మెడికవర్ ఆసుపత్రి వైద్యులు అరుదైన విజయాన్ని సాధించారు. భారీ మోతాదులో పారాక్వాట్ సేవించినపట్టికీ సమయానికి అందించిన అత్యవసర వైద్యం, నిరంతర పర్యవేక్షణ, ప్రత్యేక చికిత్సలతో రోగి పూర్తిగా కోలుకోవడం విశేషమని వైద్యులు తెలిపారు. ఈ సందర్బంగా మెడికవర్ ఆసుపత్రి జనరల్ ఫిజిషియన్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ పారాక్వాట్ అనేది ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయంలో కలుపు మొక్కలను నిర్మూలించడానికి ఉపయోగించే అత్యంత శక్తివంతమైన హెర్బిసైడ్ అని చెప్పారు. పారాక్వాట్ విషం అత్యంత ప్రాణాంతకమైనది. చిన్న మోతాదులో కూడా తీసుకున్నా ప్రాణాపాయం ఏర్పడుతుంది. దీనికి ఇప్పటివరకు ఖచ్చితమైన యాంటీడోట్ లేదు. కేవలం 25 మిల్లీ లీటర్ల మోతాదు కూడా ప్రాణాలు తీసే ప్రమాదం ఉంది అని వివరించారు. ఈ విషం శరీరంలోకి వెళ్లిన వెంటనే ఊపిరితిత్తులు, కిడ్నీలు, కాలేయం, జీర్ణాశయ వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని తెలిపారు. ముఖ్యంగా ఊపిరితిత్తుల్లో శాశ్వత నష్టం కలిగించే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. రోగిని అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి తరలించగా, వెంటనే ఎమర్జెన్సీ ప్లాస్మా ఎక్స్చేంజ్ చేసి రక్తాన్ని శుద్ధి చేసి ఐసీయూలో చేర్చి ప్రత్యేక వైద్య బృందం చికిత్స ప్రారంభించిందని డాక్టర్ రవీంద్ర రెడ్డి తెలిపారు. విష ప్రభావాన్ని తగ్గించేందుకు అవసరమైన గ్యాస్ట్రిక్ డీకంటామినేషన్, అవయవాల పనితీరును కాపాడే చికిత్సలు, నిరంతర మానిటరింగ్, క్రిటికల్ కేర్ సహాయంతో రోగి ప్రాణాలను రక్షించగలిగామని చెప్పారు. పారాక్వాట్ విషప్రయోగంలో ప్రతి నిమిషం కీలకం. ఎంత త్వరగా ఆసుపత్రికి తీసుకువస్తే అంత ఎక్కువగా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. ఆలస్యం అయితే మల్టీ ఆర్గన్ ఫెయిల్యూర్‌కు దారితీస్తుంది అని హెచ్చరించారు. వ్యవసాయ కార్మికులు, రైతులు ఇటువంటి రసాయనాలను ఉపయోగించే సమయంలో తప్పనిసరిగా రక్షణ పరికరాలు ధరించాలని, పిల్లలకు అందకుండా భద్రంగా నిల్వ ఉంచాలని సూచించారు. అనుమానాస్పద విషప్రయోగం జరిగిన వెంటనే సమీప ఆసుపత్రికి తరలించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పారాక్వాట్ విషప్రయోగం అత్యంత ప్రమాదకరమైందని వైద్య అధ్యయనాలు చెబుతున్నాయి. దీనికి నిర్దిష్ట యాంటీడోట్ లేకపోవడం, చిన్న మోతాదులోనే ప్రాణాపాయం కలగడం ప్రధాన సవాళ్లుగా గుర్తించబడ్డాయి.

## ఓటరు జాబితా సవరణ సర్వే : ఎమ్మెల్యే



**వింజమూరు, జూన్ 15, ప్రభాతవార్త** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 15 నుంచి జూలై 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ వింజమూరు పంచాయితీ పరిధిలోని పాతూరులో స్వయంగా పాల్గొన్నారు. తహసిల్దార్ స్వర్ణ, క్షేత్రస్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులతో కలిసి ఇంటింటికి తిరిగి సర్వేను పరిశీలించారు. మండలంలో మొత్తం 323 ఓట్ల కేంద్రాలు ఉండగా, వాటి పర్యవేక్షణకు 323 మంది బూత్ స్థాయి ప్రతినిధులను నియమించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. వీరందరి పర్యవేక్షణతో జాబితా సవరణ ప్రక్రియను లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు జిల్లాలో 19,74,240 మంది ఓటర్ల వివరాల పరిశీలనకు 2,352 మంది క్షేత్రస్థాయి అధికారులను నియమించినట్లు తాసిల్దార్ తెలిపారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పునాది ఓటు. 2026 జూలై 1 అర్హత తేదీగా ఈ సవరణ జరుగుతోంది. ఒక్క ఓటు కూడా మిస్ కాకూడదు. 323 ఓట్ల కేంద్రాలలో 323 మంది బూత్ స్థాయి ప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయాలి అని కోరారు. తహసిల్దార్ స్వర్ణ మాట్లాడుతూ క్షేత్రస్థాయి అధికారులు ఇంటింటి సర్వే ద్వారా ఆరవ నమూనా పత్రంతో కొత్త ఓటర్ల నమోదు, ఏడవ నమూనా పత్రంతో మరణించిన లేదా ఇల్లు మారిన వారి పేర్ల తొలగింపు, ఎనిమిదవ నమూనా పత్రంతో వివరాల సవరణ చేస్తున్నామని వివరించారు. జూలై 21న ముసాయిదా జాబితా, సెప్టెంబర్ 22న తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు. ఓటర్లు 1950 సహాయ కేంద్రం లేదా నియోజకవర్గ సహాయ కేంద్రాలను సంప్రదించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వింజమూరు మండల తెలుగుదేశం కన్వీనర్ గూడా నరసారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే స్వయంగా క్షేత్రంలోకి దిగి జాబితా సవరణపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. బూత్ స్థాయి ప్రతినిధులు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేసి వింజమూరు మండలంలో వంద శాతం లక్ష్యం సాధిస్తామని తెలిపారు. ప్రజలు కూడా తమ గుర్తింపు పత్రాలు చూపించి సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సర్వేలో కుటుంబాల విభజన, కొత్తగా పెళ్లయిన వారి నమోదు, 18 ఏళ్లు నిండిన యువత ఓటు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఒకే ఇంట్లో ఎక్కువ కుటుంబాలు ఉంటే విడిగా నమోదు చేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చేబ్రోలు వసంతరావు కోడూరు నాగిరెడ్డి, పట్టణ అధ్యక్షులు గురజాల గోపి, సీనియర్ నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి, మంచాల శ్రీనివాసులు నాయుడు, షేక్ ఖాజావలి, కే. శ్రీనివాసులు నాయుడు, గూడా నవీన్ రెడ్డి, దుద్దిగుంట శ్రీనివాసులు రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యూరియా కోసం నడిరోడ్డుపై నేతల బాహాబాహీ!





**కొడవలూరు, జూన్ 15 ప్రభాత వార్త:** కొడవలూరు మండలం పెమ్మారెడ్డిపా లెం లో యూరియా పంపిణీ వ్యవహారం రచ్చ కెక్కింది. పొట్టచేత పట్టుకుని, పంట పొలాలకు ఎరువులకోసం బారులు తీరిన అన్నదాతల సమక్షంలోనే అధికార పార్టీకి చెందిన ఇద్దరు కీలక నాయకులు బాహ బాహీకి దిగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఒక వైపు యూరియా కొరతతో పంటలు ఎండిపోతాయేమోనని రైతులు ఆందోళన చెందుతుంటే, మరోవైపు నాయ కుల ఆధిపత్య పోరుతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. నడిరోడ్డుపై నాయ కుల కుమ్ములాట.. గంటల తరబడి వేచి చూసినా యూరియా దక్కక అల్లాడుతున్న రైతులముం దు, స్థానిక టీడీపీ నేతలు త మ వర్గ పోరును బహిరం గంగానే ప్రదర్శించారు. యూరియా పంపిణీపై పట్టు సాధించేందుకు జరిగిన ఈ వివాదం చివరకు తోపులాటలకు, వాగ్వాదాలకు దారితీసింది. అన్నదాతల సమ స్యలను తీర్చాల్సిన ప్రజా ప్రతినిధులు, నాయకులు.. తమ రాజకీయ ప్రయోజనాల కోసం, వర్గ భేదాల కోసం ఇలా వీధి రచ్చకు దిగడంపై రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అసలు కారణం యూరియానేనా? లేక అంతర్గత పోరా? ఈ ఘటన ఇప్పుడు మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం యూరియా పంపిణీ విషయంలోనే గొడవ జరిగిందా? లేక గత కొంతకాలంగా మండలంలో వేళ్లూను కుపోయిన వర్గ రాజకీయాల ప్రభావం ఇలా బయటపడిందా? అనే కోణంలో ప్రజలు చర్చించుకుంటు న్నారు. మండలంలో రోజురోజుకు పెరుగుతున్న వర్గ విద్వేషాలు పాలనను అస్తవ్యస్తం చేస్తున్నాయని, దీనివల్ల సామాన్య ప్రజలు, రైతులు నలిగిపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం..** రైతుల ఆక్రందన "ఎరువులు లేక పంటలు ఎండిపోతుంటే అడగేవారు లేరు.. అడిగితే నాయకులు కొట్టుకుంటున్నారు" అంటూ రైతులు తమ గోడును వెళ్లగక్కుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఈ అరాచకం జరుగుతోందని, సమస్యను పక్కనపెట్టి నాయకులు కుమ్ములాటలకు దిగడం దారుణమని రైతులు మండిపడుతున్నారు.స్పందించాలి..

**సరఫరాను క్రమబద్ధీకరించాలి !** పెమ్మారెడ్డిపాలెం రైతులకు వెంటనే యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని, రాజకీయ జోక్యం లేకుండా పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారులను రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మండలంలో శాంతిని నెలకొల్పి ఎరువుల సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని అన్నదాతలు కోరుతున్నారు..